క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

చిట్యాల : పట్టణంలోని నేతాజీ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఆ సంఘం గౌరవాధ్యక్షుడు గుండెబోయిన సైదులుయాదవ్ సమక్షంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా సిరిబోయిన కృష్ణ, ఉపాధ్యక్షులుగా ఎడ్ల శ్రీశైలం, సాగర్ల మహేష్, ప్రధానకార్యదర్శిగా కొత్తూరు రాము, కార్యదర్శులుగా కడారి వెంకన్న, నారగోని శ్రీను, కోశాధికారిగా రాధారపు గిరి, సలహాదారులుగా గుండెబోయిన శ్రీను, కొత్తపల్లి నర్సింహ, ఓరుగంటి వెంకన్న, జంగిలి సైదులు, కొల్లోజు శ్రీకాంత్‌లు ఎన్నికయ్యారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



సర్వారం పోలింగ్ స్టేషన్‌లో ఓటర్ జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీఓ రవికుమార్

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని పోలింగ్ స్టేషన్లను ఆదివారం నల్లగొండ ఆర్డీఓ రవికుమార్ పరిశీలించారు. అనిశెట్టి దుప్పలపల్లి, సర్వారం, పజ్జూరు గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించి అధికారులకు పలు సూచనల చేశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్, సిబ్బంది సైదులు తదితరులు ఉన్నారు.

కరపత్రాల పంపిణీ



కరపత్రాలు అందజేస్తున్న దైద రవీందర్

నకిరేకల్ : మండలంలోని పాలెం గ్రామంలో కాంగ్రెస్ నేత దైద రవీందర్ ఆదివారం గడపగడపకు కాంగ్రెస్ పార్టీ హామీల కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింత పున్నయ్య, కొరె రామకృష్ణ, మాచర్ల శేఖర్, కల్లేపల్లి ఇస్తారి, వెంకన్న, గోవర్ధన్, బందెల యాదగిరి, భాగ్యరాజు, రామచంద్రు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

మర్రిగూడ : ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీకి వ్యతిరేకంగా గ్రామస్థాయి నుంచి ఢిల్లీ వరకు ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బండా శ్రీశైలం పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని తిరగండ్లపల్లిలో నీలకంఠం రాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు కొట్టం యాదయ్య, మైల సత్తయ్య, చెల్లం ముత్యాలు, వెంకటయ్య పాల్గొన్నారు.


కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల, అంగన్‌వాడీ టీచర్లు

నల్లగొండ టూటౌన్ : మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా ప్రభుత్వం గుర్తించడంపై హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర మినీ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ఆదివారం పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్‌లో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మినీ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఇందిర, బీఆర్‌టీయూ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అవుట రవీందర్, ప్రధాన కార్యదర్శి సుహాసిని, సబిత, రాములమ్మ, చంద్రకళ, శైలజ, అనూష, భాగ్య, ధనమ్మ పాల్గొన్నారు.

గ్రామదేవతల విగ్రహాలకు జలాభిషేకం



పిట్టంపల్లిలో పాటలు పాడుతున్న మహిళలు

చిట్యాల : వర్షాలు కురవాలని కోరుతూ మండలంలోని పిట్టంపల్లి గ్రామంలో మహిళలు ఆదివారం గ్రామ దేవతల విగ్రహాలకు, ధ్వజస్తంభాలకు జలాభిషేకం చేశారు. వర్షాలు కురవాలని రుణ దేవుడిని ప్రార్థిస్తూ మహిళలు పాటలు పాడారు.

రోగులకు వసతులు కరువు!

- తాగునీటికి తప్పని తంటాలు
- పనిచేయని బీపీ చెక్ చేసే మిషన్లు
- వెనుదిరుగుతున్న రోగులు



తాళం వేసి ఉన్న ఎక్స్‌రే గది వద్ద నిరీక్షిస్తున్న రోగులు



బీపీ చెకప్ కోసం క్యూలో నిల్చున్న రోగులు

మర్రిగూడ : కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మెరుగైన వైద్యం అందుతుందని భావిస్తున్న చుట్టుపక్కల మండలాల ప్రజలకు నిరాశ ఎదురవుతోంది. రోగుల ప్రాథమిక అవసరాలను గుర్తించే పరికరాలు పనిచేయకపోవడంతో ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. మర్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)గా చేసి జనవరి 3న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ ఆస్పత్రి పరిధిలో మండలంలో ఏడు సబ్ సెంటర్లు ఉన్నాయి. మండలంలోని 20 గ్రామ పంచాయతీలు, 25 ఆవాస గ్రామాల్లో 38వేలకు పైగా జనాభా ఉన్నారు. మండల ప్రజలతోపాటు ఇతర సమీప మండలాలైన నాంపల్లి, చింతపల్లి, గట్టుప్పల్, మాల్ ప్రాంతాల నుంచి కూడా రోగులు నిత్యం వస్తుండడంతో ఓపీల సంఖ్య 200 నుంచి 300 వరకు చేరుకుంటోంది. ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. సాధారణ జ్వరాల బారినపడిన వారి సంఖ్యతోపాటు బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి వ్యాధిగ్రస్తులు కూడా నెలకు రెండుమార్లు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు.

ఎక్స్‌రే కోసం రోగుల అగచాట్లు

అత్యవసర పరిస్థితుల్లో లేదా ఎముకలకు సంబంధించిన సమస్యలను గుర్తించేందుకు ఎక్స్‌రే తీయాల్సి ఉంటుంది. అయితే ఎక్స్‌రే మిషన్ ఆపరేటర్ మధ్యాహ్న సమయం వరకే సేవలు అందిస్తున్నారని, మధ్యాహ్నం తర్వాత వచ్చిన రోగులను మరుసటిరోజు రావాలని అంటున్నారని రోగులు చెబుతున్నారు. గత శుక్రవారం ఎక్స్‌రే అవసరమైన రోగులు మధ్యాహ్నం వరకు ఎదురు చూశారు. కాని ఆపరేటర్ సెలవులో ఉన్నాడని తెలియడంతో చేసేదేమిలేక వెనుదిరిగారు. ఆస్పత్రిలో బీపీ చెక్‌చేసే మిషన్లు అన్ని దాదాపు చెడిపోవడంతో రోగులు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

మంచినీటి సౌకర్యం ఏది....

ఆస్పత్రిని ప్రారంభించే సమయంలో మినీ నీటి ట్యాంక్ అడ్డుగా ఉందని తొలగించారు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులతోపాటు వైద్య సిబ్బందికి తాగునీటి తిప్పలు తప్పడం లేదు. బీపీ మిషన్లకు మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తేవాలని, ఎక్స్‌రే ఆపరేటర్ నిత్యం అందుబాటులో ఉండేవిధంగా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. కాగా గత గురువారం కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ ఆస్పత్రిని సందర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రెండుగంటలు ఎదురు చూశా



నాకు నడుము, మోకాళ్ల నొప్పులు విపరీతంగా ఉండడంతో ఎక్స్‌రే తీయించుకోవాలని డాక్టర్ చీటీపై రాశారు. అక్కడికి వెళ్లి చూస్తే ఎక్స్‌రే గదికి తాళం వేసి ఉంది. దాదాపు 2గంటలు ఎదురు చూసి ఈరోజు రాడని తెలియడంతో వెనుదిరిగా. రోగులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తే బాగుంటుంది.

–ఈద పెదమారయ్య, కొండూరు

బీపీ మిషన్లు పనిచేయడం లేదంటున్నారు



రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నా. ఆస్పత్రికి వస్తే పలు పరీక్షలు చేయించుకోవడంతోపాటు బీపీ చెక్ చేయించుకోవాలని రాశారు. బీపీ చెకప్ కోసం వెళ్తే బీపీ మిషన్లు పనిచేయడం లేదంటున్నారు. బీపీ ఎంత ఉందో తెలుసుకోవడం ఇబ్బందిగా మారింది.

–గడ్డం శంకరయ్య, రాంరెడ్డిపల్లి

ఇండెంట్ పెట్టాం

బీపీ మిషన్లు పనిచేయడం లేదని ఇటీవల ఇండెంట్ పెట్టాం. త్వరలోనే బీపీ పరికరాలు అందుబాటులోకి వస్తాయి. ఎక్స్‌రే మిషన్ ఆపరేటర్ అనారోగ్య రీత్యా సెలవులో ఉన్నాడు. మరొకరిని తాత్కాలికంగా ఏర్పాటు చేస్తాం. రోగులకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం.

–శంకర్‌నాయక్, సూపరింటెండెంట్

దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : దివ్యాంగుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని డ్వాబ్ సంస్థలో అంధుల అభివృద్ధి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులకు రూ.3016 ఉన్న పింఛన్‌ను రూ.4016లకు ప్రభుత్వం పెంచిందని తెలిపారు. అనంతరం దివ్యాంగులకు లిక్కర్ షాపుల లాటరీలో 5 శాతం ఇవ్వాలని కోర్టును ఆశ్రయించామని, సీఎం దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి దివ్యాంగులకు కోటా ఇప్పించాలని అంధుల అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ గోగుల శ్రీనివాస్‌యాదవ్, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కంచర్ల అంజిరెడ్డి, ఎల్. గోవర్ధన్, శ్రీనివాస్, యామ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సబ్బండ వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ మండలంలోని అన్నెపర్తి గ్రామానికి చెందిన 200 మందికి పైగా కాంగ్రెస్ కార్యకర్తలు మేకల అశోక్‌రెడ్డి, బోయ నాగయ్య ఆధ్వర్యంలో వీటీ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తరువాత సంక్షేమ పథకాలకే రూ. 50 వేల కోట్లు ఖర్చు చేశారని అన్నారు. రైతులకు ఉచిత కరెంట్, రైతుబీమా, రైతుబంధు, లక్ష రూపాయల రుణమాఫీ లాంటి పథకాలతో ప్రజలందరికి లబ్ధి చేకూరుస్తున్నాయని తెలిపారు. ఇటు అభివృద్ధి, అటు సంక్షేమంలో కేసీఆర్ నాయకత్వంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నెంబర్‌వన్ స్థానంలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్‌వలీ, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, నాయకులు బకరం వెంకన్న, రాంరెడ్డి, ఎదుళ్ల అరుణాకర్‌రెడ్డి, తవిటి కృష్ణ, శంకర్, లింగస్వామి, సాదిక్ వలీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం



అభివాదం చేస్తున్న చలమల్ల కృష్ణారెడ్డి

మర్రిగూడ : కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నర్సిరెడ్డిగూడెం, శివన్నగూడ, ఇందుర్తి, కొట్టాల, లెంకలపల్లి, కమ్మగూడ గ్రామాల్లో ప్రజా చైతన్యయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కుటుంబ పాలన కొనసాగించారే తప్ప ప్రజల సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీతోపాటు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే విధంగా చొరవ చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దం నర్సింహగౌడ్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బన్సీలాల్, నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్పని అనిత, వర్కింగ్ ప్రెసిడెంట్ కల్లెం జైపాల్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క తిరుపతయ్య, సిద్ధపురం జంగయ్య, రామిడి యాదగిరిరెడ్డి, కొట్టం శ్రీనివాస్, సిరిపంగి శ్రీనివాస్, పగిళ్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న నామ రాంప్రసాద్

నల్లగొండ : మేరు కులస్తులకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించాలని మేరు సంఘం పట్టణ అధ్యక్షుడు నామ రాంప్రసాద్ కోరారు. ఆదివారం పట్టణంలోని మేరు సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇచ్చే స్కూల్ యూనిఫాం కుట్టేందుకు మేరు కులస్తులకు మాత్రమే అవకాశం ఇవ్వాలని కోరారు. మేరు కులస్తులకు ఉచితంగా కరెంటు, 50 సంవత్సరాలు నిండిన వారికి ఆసరా పెన్షన్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని కోరారు. రేణుకుంట్ల రాము, కార్యదర్శి రాపర్తి రాములు, పానుగంటి కిషన్, రాపర్తి శ్రీనివాస్, దీకొండ వెంకటేశ్వర్లు, టంగుటూరి సురేష్, శ్రీనివాస్, పద్మ, సంధ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

కుల వృత్తిదారుల సంక్షేమానికి ప్రాధాన్యం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల : కుల వృత్తిదారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ పథకాలను పకడ్బందీగా అమలుచేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాల పట్టణంలో పాండవ ముదిరాజ్ మత్స్యకార్మిక సంఘం నూతన భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన మత్స్య ముదిరాజ్ కులస్తులకు బీసీ సబ్సిడీ రుణాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, కౌన్సిలర్లు కోనేటి కృష్ణ, బెల్లి సత్తయ్య, జమీరొద్దీన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్న ప్రతిఒక్కరికి ప్రాధాన్యత ఉంటుందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల మహిళలు బీఆర్‌ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు చెర్కుపల్లి శశిరేఖ మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం నార్కట్‌పల్లిలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో బోయ లక్ష్మిదేవమ్మ, వలిగొండ పార్వతమ్మ, బుస్సా అంజమ్మ, రేడపాక మమత, బోయ దేవిక, రమణ, మరియమ్మ, కవితలతో పాటు మరికొందరు ఉన్నారు.

వైభవంగా బోనాలు, విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



నకిరేకల్ : బోనాలతో వెళ్తున్న మహిళలు



కట్టంగూర్ : బోనాలు ఎత్తుకెళ్తున్న మహిళలు

కట్టంగూర్ : మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ ప్రజలు ముత్యాలమ్మ పండుగను ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు నూతన వస్త్రాలు ధరించి బోనాలు ఎత్తుకెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మేడి ఈదయ్య, వార్డు సభ్యుడు మునుగోటి ఉత్తరయ్య, శ్రీను, మాతంగి యాదయ్య, మేకల రమేష్, మేడి రాంబాబు, లింగయ్య పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

కేతేపల్లి : మండలంలోని బొప్పారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు పసుపు, కుంకుమలతో అందంగా అలంకరించిన బోనాలను తలపై పెట్టుకుని ప్రదర్శనగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాల్లో వండిన నైవేద్యాన్ని, పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి కోళ్లు, యాటలను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి మాజీ చైర్మన్ చల్ల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, సర్పంచ్ కక్ర ప్రభాకర్‌రెడ్డి వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి బోనాలు

నకిరేకల్ : నకిరేకల్‌లో నూతనంగా నిర్మించిన శ్రీపెద్దమ్మ తల్లి ఆలయంలో బోనాల పండుగ ఆదివారం వైభవంగా జరిగింది. స్థానిక శివాలయం నుంచి భారీ ఊరేగింపుగా బోనాలతో ప్రదర్శన నిర్వహించారు. ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో ఆలయ అధ్యక్షుడు బండమీది నర్సింహ, నాగరాజు, మైసయ్య, అంజయ్య, సైదులు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

• కళ తప్పిన నందనవనం









నల్లగొండ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు ఫారెస్టు కార్యాలయంలో కొన్నేళ్ల క్రితం నీలగిరి నందనవనం పార్కు నిర్మించారు. పార్కులో గిరిజన సంస్కృతి అద్దంపట్టేలా ఏర్పాటు చేసిన వివిధ రకాల బొమ్మలు నేడు రంగుమారి, పాడైపోవడంతో నందనవనం కళా విహీనంగా కనపడుతోంది. బొమ్మల చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ

దాతృత్వం చాటుకున్న యువకులు



నగదు అందజేస్తున్న యువకులు

కనగల్ : మండల పరిధిలోని పర్వతగిరి గ్రామానికి చెందిన చనగాని సురేష్, తొలుగాళ్ల నాగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కావడంతో ప్రమాదానికి గురైన యువకుల ఫొటోలను గ్రామ యువత సోషల్ మీడియా ద్వారా పలు గ్రూపుల్లో పోస్ట్ చేసి బాధితులకు అండగా నిలబడాలని కోరారు. స్పందించిన గ్రామ యువకులు, పెద్దలు, ఇతరులు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా రూ.2,25,000 పంపారు. ఈమొత్తాన్ని సురేష్, నాగరాజు కుటుంబాలకు గ్రామ యువజన సంఘం సభ్యులు ఆదివారం ఆస్పత్రిలో అందజేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకంటి శ్రీశైలం, లింగస్వామి, అనిల్, వెంకన్న, కోటేష్, సిరి, అనిల్, బసవరాజ్, శంకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్‌ఓ దామోదర్‌రావు

చండూరు(గట్టుప్పల్) : ప్రత్యేక ఓటర్ క్యాంపులను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని మునుగోడు ఆర్‌ఓ దామోదర్‌రావు అన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ క్యాంపులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సెప్టెంబర్ 2,3 తేదీల్లో మరో దఫా ఓటర్ ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తామని, ఓటర్లు తప్పులను సవరించుకోవడంతోపాటు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో గతంలో 298 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం 307 కు పెరిగినట్లు తెలిపారు. చౌటుప్పల్ 4, గట్టుప్పల్ 1, చండూరులో 1, నాంపల్లిలో 3, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ఉప తహసీల్దార్ దీపక్, గట్టుప్పల్ తహసీల్దారు లావణ్య, గట్టుప్పల్ ఉప తహసీల్దార్ ఎండీ మధార్ హుస్సేన్ పాల్గొన్నారు.

ముగిసిన కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే పర్యటన



పార్టీ నాయకులతో ఎమ్మెల్యే విఠల్ సోమన్న

నల్లగొండ టూటౌన్ : ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా నల్లగొండ నియోజకవర్గ పర్యటనకు వచ్చిన కర్ణాటకలోని ఖానాపూర్ బీజేపీ ఎమ్మెల్యే విఠల్ సోమన్న హల్గేకర్ పర్యటన ఆదివారం ముగిసింది. బూత్ స్థాయిలో పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై కార్యకర్తలు, నాయకుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులతో వేర్వేరుగా సమావేశమై బూత్ కమిటీల నియామకం, వాటి పనితీరు తదితర విషయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, నూకల నరసింహారెడ్డి, ఓరుగంటి రాములు, నాగం వర్షిత్‌రెడ్డి, చింత ముత్యాల్‌రావు, రావెళ్ల కాశమ్మ దాసోజు యాదగిరాచారి, రాఖీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం



మాట్లాడుతున్న కొండేటి మల్లయ్య

నకిరేకల్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య అన్నారు. నకిరేకల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేవెళ్లలో జరిగిన ప్రజా గర్జన సభలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ద్వారా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలను సాకారం నిజం చేయడానికి సంచలన నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఈ సమావేశంలో చామల శ్రీనివాస్, సుంకరబోయిన నర్సింహ, పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, అశోక్, జమీరుద్దీన్, ఉపేందర్‌రెడ్డి, శంకర్, తొడుసు సైదులు, కొండ అంజమ్మ, సురిగి జ్యోతి, ఆవుల వేణు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



జెండా ఎగురవేస్తున్న నారబోయిన శ్రీనివాస్

చిట్యాల : గ్రామ పంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జెండా పండగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వెలిమినేడు గ్రామంలో జీపీ కార్మికుల జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలన్నారు. అర్రూరి సాంబయ్య, నాతి వెంకట్రామయ్య, మహంకాళి బాలమ్మ, వలిగొండ లింగయ్య, అర్రూరి మల్లేశం, మహంకాళి మల్లమ్మ, గణేశ్, యాదయ్య, శంకరయ్య, రమణ పాల్గొన్నారు.